# సత్యవతి సమాధానం

"పట్టు చీర కొనక తప్పదు" అన్నది మంగళ.

రాజు నవ్వి "నన్నడిగి ప్రయోజనంలేదు. నాన్నని అడుగు. అంతా నాన్న ఇష్టం" అన్నాడు.

"పెళ్ళి చేసుకునేది నువ్వు కట్నం నీపెళ్ళిగురించి ఇస్తున్నారు. అలాంటప్పుడు నేను పట్టుచీర కొనమని నిన్నే అడగటం న్యాయం" అన్నది మంగళ మళ్ళీ.

"కట్నం నా పెళ్ళిగురించే ఇస్తున్నారు. నిజమే చెల్లెమ్మా.... కానీ ఆ డబ్బును నేను తీసుకోవటంలేదు. నాన్న తీసుకుంటున్నాడు. అందువల్ల నువ్వు నాన్ననే అడగాలి" అన్నాడు.

ఈ పట్టుచీర గురించి రాజుకి- మంగళకి కొంచెంసేపు వాదన జరిగింది.

కొంచెంసేపటి తర్వాత రాజు ఇలా అన్నాడు-

"అడపడుచు లాంఛనాల రూపంలో నీకు వెయ్యి రూపాయలు ఇస్తున్నారు కదా! ఆ డబ్బుతో నువ్వు పట్టుచీర కొనుక్కోరాదూ?"

"నీ ఆలోచన బాగానే వుంది. లాంఛనం వాళ్ళు ఇస్తున్నారు. నువ్వు కాదు. నేను నీ పెళ్ళిగురించి పట్టుచీర కొనివ్వమని అడుగుతున్నాను. ఎంతో ఖరీదు వుండదు." అన్నది మంగళ.

రాజు వెంటనే మాట్లాడలేదు.

అతను ఓ బేంక్‌లో ఎనిమిది నెల్లనించీ ఉద్యోగం చేస్తున్నాడు. అతనికి పదిహేను రోజుల క్రితం ఓ సంబంధం వచ్చింది. ఆ అమ్మాయి పేరు సత్యవతి. చూడగానే రాజు మనసును ఆ అమ్మాయి ఆకర్షించింది. సత్యవతి ఇంటర్ వరకు చదువు కోవటంవల్ల ఆ విషయంలో కూడా అతనికేమీ అభ్యంతరం కనిపించలేదు.

ఆతర్వాత రాజు తండ్రి డిమాండ్‌చేసిన పదహారు వేల కట్నాన్ని సత్యవతి తండ్రి ఇవ్వటానికి అంగీకరించాడు. ఇతర లాంఛనాల బేరంకూడా కుదిరిన తర్వాత రెండు రోజుల క్రితమే ముహూర్తాలు పెట్టుకున్నారు. ఇంకో పదమూడు రోజుల్లోనే వుంది పెళ్ళి.

ముహూర్తాలు పెట్టుకునే రోజునే రాజు తండ్రి అడిగినట్టుగా సత్యవతి తండ్రి ఎనిమిది వేల రూపాయలను కట్నం అడ్వాన్స్‌గా ఇచ్చాడు.

రాజు తల్లిదండ్రులు పెళ్ళికి కావలసిన వస్తువులు తీసుకురావ టానికి బజారుకు వెళ్ళారు.

ఆ ఇంట్లో ప్రస్తుతం అన్న-చెల్లెలు వున్నారు.

వాళ్ళమధ్య పట్టుచీరగురించిన సంభాషణ అలా జరుగుతున్నది. ఇక- రాజు మౌనంగా వుండటాన్ని చూసి "ఏమిటిబ్రదర్ ఆలోచిస్తు న్నావ్? పట్టుచీర కొనమంటే దిగులుగా వున్నదా?" అన్నది నవ్వుతూ మంగళ.

"లేదు మంగళా.... నీ ఇష్టమయినట్టే పట్టుచీర కొనుక్కో..... నాన్ననడిగి డబ్బు ఇప్పిస్తాను. కాని మరో విషయం. నా మనసులో వున్న మాట నీకు చెబుతున్నాను. నా పెళ్ళికి కట్నం తీసుకోటం నాకిష్టం లేదు" అన్నాడు రాజు.

ఒక్కక్షణం ఆశ్చర్యపడి "అదేమిటి?" అన్నది చెల్లెలు.

"అవును నీ పెళ్ళిక్కూడా కట్నం ఇవ్వాలి కాబట్టి నేను ఇందుకు ఒప్పుకున్నాను. లేకపోతే ఒప్పుకునే వాడిని కాదు" అన్నాడు కొంచెం బాధగా—

ఇప్పుడు అతనెందుకు బాధ పడుతున్నాడో మంగళకు అర్థం కాలేదు.

"తీసుకునే టప్పుడు తీసుకుంటాం.... ఇచ్చేటప్పుడు ఇస్తాం. ఇందులో బాధపడటానికి ఏముంది?" అన్నది చాలా సహజమైన విషయమయినట్లు.

"నువ్వు ఈ విషయం గురించి చాలా ఈజీగా మాట్లాడుతున్నావు. ఈ కట్నాల గురించి చాలామంది అమ్మాయిల తల్లిదండ్రులు ముసలివాళ్ళకు- దుర్మార్గుడని తెలిసినా ఆ మగవాడికే ఇచ్చి కన్నెచెర వదిలించుకుంటున్నారు. చాలామంది కూతురి భవిష్యత్తుకంటే ముందు ఏదో విధంగా ఆమెను వదిలించుకుని బరువు దించుకోటానికే చూస్తున్నారు. దీనిక్కారణం ఏమిటి? ఈ కట్నం సమస్యేకదా?" అన్నాడు.

మంగళ అతని అభిప్రాయాన్ని ఒప్పుకోలేదు.

"కూతురి భవిష్యత్తును ఆలోచించకుండా పెళ్ళిళ్లు చేసే తల్లిదండ్రులు లక్షమందిలో ఒకరిద్దరు వుంటారు. అలాంటి వాళ్ళగురించి మనం మాట్లాడుకోవలసిన అవసరంలేదు" అన్నది.

ఈ విషయం గురించి కూడా వాళ్ళిద్దరి మధ్యనా చాలాసేపు వాదన జరిగింది. చివరికి రాజు నవ్వి "అయితే నేను నా ఆలోచన నిజమైనదని నిరూపించుకుంటాను. బెట్ కడతావా?" అన్నాడు.

"ఎలా నిరూపిస్తావు?"

"ఎలాగో చెబుతాను. ఇప్పుడు మనం ఒక ప్రయోగం చేద్దాం. అదేమిటంటే నేను మంచి వాడ్ని కాదనీ- నాకు అన్నిరకాల చెడు అలవాట్లు వున్నాయనీ - ఇద్దరు అమ్మాయిలను పెళ్ళి చేసుకుంటానని మోసం చేశాననీ - నన్ను చేసుకుంటే ఆ అమ్మాయి జీవితం నాశనం అవుతుందనీ - ఈ సంబంధం వదులుకోమనీ నాక్కాబోయే మామగారికి ఆకాశరామన్నలాగా ఓ ఉత్తరం రాసి పోస్టు చెయ్యి. ఆ ఉత్తరం చూసుకుని ఆయన మనదగ్గరకు పరిగెత్తుకుంటూ వచ్చాడంటే నువ్వు గెలిచినట్టే.... అలా కాకుండా నా పెళ్ళి మామూలుగా జరిగిపోతే నువ్వు ఓడిపోయినట్టు.... ఏమంటావ్?" అన్నాడు.

"వద్దు... పెళ్ళి ఆగిపోతుందేమో" అన్నది మంగళ.

"ఆగిపోదు. ఒకవేళ అటువంటి పరిస్థితి వస్తే ఆ ఉత్తరాన్ని మనమే రాశామని అసలు సంగతి బయటపెడదాం. మరి బెట్ కడతావా?" అన్నాడు రాజు.

"ఎంత?" అన్నది మంగళ.

"నువు గెలిస్తే నీకు వెయ్యి రూపాయలిస్తాను. నువ్వు ఓడిపోతే నీకు లాంఛనంగా వచ్చే వెయ్యి రూపాయలు నాకివ్వు" అన్నాడు.

అందుకు ఒప్పుకున్నది మంగళ.

రాజు ఆమెకు ఓ ఉత్తరాన్ని డిక్టేట్ చేశాడు. అతను చెప్పినట్టుగానే కొంచెం భయంకరంగా రాసిందామె. తర్వాత అప్పుడే ఆ ఉత్తరాన్ని పోస్ట్ చెయ్యటానికి బయల్దేరింది.

"ఇది రహస్యం" అన్నాడు రాజు.

"సర్లే" అన్నది మంగళ నవ్వి.

* * * *

నాలుగు రోజులు గడిచాయి.

అయినా సత్యవతి ఇంటినించి ఎవ్వరూ రాలేదు రాజు ఇంటికి ఉత్తరం వాళ్ళకు చేరలేదేమోనని మరో ఉత్తరాన్ని రాసి పోస్టుచేసింది మంగళ. ఆ తర్వాత మరో ఉత్తరాన్ని కూడా రాసింది.

పెళ్ళిరోజు కూడా వచ్చింది. ఐనా ఈ ఉత్తరాలకు రెస్పాన్స్ లేకుండా పోయింది.

మంగళ ఆశించినట్టుగా పెళ్ళికూతురి తండ్రి ఆ ఉత్తరాల గురించి మాట్లాడటానికి రాలేదు.

చివరికి రాజు పెళ్ళి సత్యవతితో జరిగిపోయింది.

కనీసం వాళ్ళు ఈ విషయం గురించి బాధపడుతున్నట్టు కూడా మంగళకు అనిపించలేదు.

ఆమె ఓడిపోయి వెయ్యి రూపాయలు అవుట్ అనుకున్నది.

పెళ్ళికూతురు- ఆమె తల్లిదండ్రులు అంత హుషారుగా వుండటం రాజుకు ఆశ్చర్యాన్ని కలిగించింది. ఉత్తరాలు అందలేదేమో అనుకున్నాడు. కాని తన తండ్రి రాసిన ఓ ఉత్తరానికి వాళ్ళనించి వెంటనే రెస్పాన్స్ వచ్చింది. మరి ఉత్తరాలు అందకుండా ఎలా వుంటాయి?

సత్యవతిని గదిలోకి పంపిన తర్వాత ఆమె కొంత సిగ్గును పోగొట్టుకున్న తర్వాత "ఉత్తరాలు అందలేదా?" అన్నాడు చిన్నగా.

పెళ్ళికూతురు వులిక్కిపడి "వాటి గురించి మీకెలా తెలుసు?" అన్నది.

"అయితే ఆ వుత్తరాలు మీకు అందాయన్న మాట. మరి ఆ ఉత్తరాలు చదివికూడా ఏమీ తెలీనట్టు వూరుకున్నారేమిటి?" అన్నాడు.

అప్పుడు సత్యవతి "సర్లెండి. ఆ ఉత్తరాల గురించి ఎవరు పట్టించుకుంటారు? నాతో బావ వున్నాడు. వాడో అగస్టు వేధవ

వాడికి నన్ను పెళ్ళి చేసుకోవాలని వుంది. ఐనా వాడెవ్వరు పెళ్ళిచేసుకుంటారు? వాడు నామీద కోపంతో ఇంతకు ముందుకూడా ఓ పెళ్ళికొడుకు గురించి ఇట్లాగే రాశాడు. మేము నిజమే అనుకుని ఆ సంబంధాన్ని వదులుకున్నాం. తర్వాత తెలిసింది ఆ వుత్తరాన్ని వాడే రాయించాడని. ఈసారి కూడా ఈ వుత్తరాలను మా బావ వెధవ రాసి వుంటాడని వాటిని చించి పారేశాడు మా నాన్న. ఐతే ఆ వుత్తరాలను మా బావ వెధవ రాయలేదా?" అని ఎదురడిగింది సత్యవతి.

వెంటనే రాజు పెద్దగా నవ్వి "ఓహ్....బ్యూటిఫుల్ ఎండింగ్.... పాపం– మా చెల్లెలు వెయ్యి రూపాయలు పోయాయని ఒహటే కుమిలి పోతోంది" అన్నాడు.

సత్యవతికి అతని మాటలు అర్థం అవక "మీ చెల్లెలు వెయ్యి రూపాయలు పోవటం యేమిటి? ఎప్పుడు పోయాయి? పెళ్ళిలోనా?" అన్నది కంగారుగా–

"అదంతా ఒక కథలే సత్యవతీ. ఇప్పుడు మనం కథలతో కాలం గడపకూడదు. ఇది మన మొదటి రాత్రి. అంటే ఇంగ్లీష్‌లో ఫస్ట్ నైట్" అన్నాడు రాజు వస్తున్న నవ్వును బలవంతంగా నొక్కిపట్టి– సత్యవతిని తన గుండెకేసి అదిమిపెట్టి.

*

(విజయ - ఆగస్టు 1984)